# అంకెలు, సంఖ్యలు: లెక్కకి అందని కాలమానం

వేమూరి వేంకటేశ్వరరావు

ప్రాచీన భారతీయ సంస్కృతికీ పాశ్చాత్య సంస్కృతికీ మధ్య కొట్టొచ్చినట్లు ఒక తేడా కనిపిస్తుంది. పెద్ద పెద్ద సంఖ్యలంటే మనవాళ్ళకి బొత్తిగా భయం లేదు. పాశ్చాత్యులకి పెద్ద సంఖ్యలంటే భయమా అని మీరు నన్ను నిలదీసి అడగొచ్చు. వాళ్ళకి భయమో, బెంగో నాకు తెలీదు కానీ, వాళ్ళ పురాతన సంస్కృతిలో పెద్ద పెద్ద సంఖ్యల ప్రస్తావనే లేదు; వాటి అవసరం వాళ్ళకి వచ్చినట్లే లేదు!

ఉదాహరణకి కాలమానమే చూద్దాం. బైబిలు ప్రకారం ఈ సృష్టి జరిగి ఉరమరగా 5,000 ఏళ్ళు అయింది. క్రైస్తవుల దృష్టిలో సృష్టికి ముందు ఏమీ లేదు కనుక 5,000 కంటె పెద్ద సంఖ్య యొక్క అవసరం వాళ్ళకి తట్టి ఉండకపోవచ్చు.

నా చిన్నతనంలో మా నాన్నగారు తమాషాకి చిన్న కథ చెప్పేవారు. రావణాసురుడు కొన్ని వేల సంవత్సరాలు రాజ్యం ఏలేడని అంటారు కదా. రావణుడు పుట్టగానే ఎవ్వరో బ్రహ్మ దగ్గరకి ఈ వార్త మోసుకెళ్ళి, మనవడికి జాతకం రాయమని అడిగేరుట. బ్రహ్మ అప్పుడే కాలకృత్యాలు తీర్చుకుందుకని చెంబు పుచ్చుకుని బయటకు బయలు దేరుతూ, "ఈ పని అయిన తర్వాత చూద్దాం" అన్నాడుట. బ్రహ్మ పని ముగించుకుని తిరిగి వస్తూ ఉంటే, "తాతా! నీ మనవడు చచ్చి పోయాడు," అని చావు వార్త చల్లగా అందించేరుట. మన కాలమానం ఎంత విస్తృతమైనదో ఊహించుకోడానికి ఈ కథ ఉపయోగపడుతుంది.

మన కాలమానం ప్రకారం కలియుగం ఒక్కటే 4,32,000 సంవత్సరాలు. ఇంకా మహాయుగాలు, మన్వంతరాలు, బ్రహ్మకల్పాలు ఎన్నో ఉన్నాయి. మనం ఇప్పుడు కొంచెం సావధానంగా ఈ కాలమానాన్ని పరిశీలిద్దాం.

కలియుగం కంటె ద్వాపరయుగం రెండింతలు, త్రేతాయుగం మూడింతలు, కృతయుగం నాలుగింతలు అన్న విషయం మనందరికీ తెలుసు. ఈ నాలుగు యుగాలని కలిపి ఒక మహాయుగం అంటారు. అంటే ఒక మహాయుగం కలియుగం కంటె పదింతలు, లేదా 43,20,000 సంవత్సరాలు. ఆధునిక పరిభాషలో 4.32 మిలియను సంవత్సరాలు – ఇవన్నీ మన భూలోకపు లెక్క. కనుక వీటిని మానవ సంవత్సరాలు అందాం. కాని సృష్టిని జరిపే బ్రహ్మ సత్యలోకంలో ఉంటాడు. అక్కడ సంవత్సరం పొడుగు వేరు. అక్కడ లెక్క ఇలా ఉంటుంది. సత్యలోకంలో పగటి పూటని ఒక కల్పం అనీ, రాత్రి పూటని ఒక కల్పం అనీ అంటాం. ఒక పగలూ, రాత్రీ కలపగా వచ్చిన రోజుని విశేషకల్పం అంటారు. సత్యలోకంలో తెల్లవారే వేళకి సృష్టి మొదలవుతుంది. సాయంత్రానికి సృష్టి అంతా లయమైపోతుంది. దీనినే ప్రళయం అంటారు. రాత్రి అంతా మరుసటి దినం జరగబోయే సృష్టికి నాంది. ఒక కల్పం 14 మన్వంతరాల కాలం. ఒకొొక్క మన్వంతరం 71 మహాయుగాల మీద చిల్లర. ఈ చిల్లర ఎక్కడనుండి వచ్చిందంటే – అదంతా మరొొక కథ; ఇప్పుడు చెప్పడం మొదలు పెడితే అది పెడదారి అవుతుంది. ఏది ఏమైతేనేమి, ఒక కల్పంలో 14 *71 = 994 మహాయుగాలు. (ఇక్కడ నక్షత్రాన్ని గుణకారానికి గుర్తుగా వాడేను). దీనికి పైన చెప్పిన చిల్లర కలిపితే ఒక కల్పానికి 1,000 మహాయుగాలు. ఒకొొక్క మహాయుగం 43.2 మిలియను సంవత్సరాలు కనుక ఒక కల్పం 4.32 * 1,000 మిలియను = 4.32 బిలియను మానవ సంవత్సరాలు. ఇది ఉరమరగా మన భూలోకపు వయస్సు.

కనుక బ్రహ్మదేవుడి పగలు 4.32 బిలియను సంవత్సరాలు, రాత్రి 4.32 బిలియను సంవత్సరాలు. లేదా, సత్యలోకంలో ఒక రోజు 8.64 బిలియను మానవ సంవత్సరాలు. ఇటువంటి 360 రోజులు ఒక సంవత్సరం. (ఇక్కడ భూలోకంలో ఉరమరగా 360 రోజులు సంవత్సరం అవుతుంది కాని సత్యలోకంలో అవాలని లేదు. ఇక్కడ తార్కికంగా మనవాళ్ళు పప్పులో కాలేసేరు, కాని అది మనకి

ఇప్పుడు అనవసరం.) కనుక ఒక బ్రహ్మదేవుడి సంవత్సరం 360 * 8.64 = 3,110.4 బిలియను మానవ సంవత్సరాలు, లేదా 3.1104 ట్రిలియను సంవత్సరాలు. ఇది మన విశ్వం వయస్సుకి 200 రెట్లు!

బ్రహ్మ ఆయుర్దాయం వంద సత్యలోకపు సంవత్సరాలు, లేదా 311.04 ట్రిలియను సంవత్సరాలు. ఈ కాలాన్నే "పర" అంటారు. ఇందులో సగం "పరార్ధం". మనం ఇప్పుడు ద్వితీయ పరార్ధంలో ఉన్నాం. ఇంకా నిక్కచ్చిగా చెప్పాలంటే "ఇప్పటి" మన బ్రహ్మదేవుడి ఇప్పటి వయస్సు 51 సంవత్సరాలు. ఈ 51వ సంవత్సరాన్ని శ్వేతవరాహ కల్పం అంటారు. ఈ శ్వేతవరాహ కల్పంలో ప్రస్తుతం నడుస్తూన్న ఏడవ మన్వంతరాన్ని వైవశ్వత మన్వంతరం అంటారు. ఈ మన్వంతరంలోని 28వ మహాయుగంలోని కలియగంలో, ప్రథమ పాదంలో ఉన్నాం. ఈ కలియుగం శ్రీకృష్ణ నిర్యాణంతో ఉరమరుగా 5,000 ఏళ్ళ క్రితం మొదలయింది. ఈ ప్రథమ పాదంలోనే కలికాలం ఇలా మండిపోతోంది. ఇహ చతుర్ధ పాదంలో ఎలా ఉంటుందో అన్నది వేరే విషయం అనుకోండి.

పై పేరాలో "ఇప్పటి మన బ్రహ్మదేవుడి" అన్న మాటలు వాడేను. చదువరులలో కుశాగ్రబుద్ధులు వెంటనే "మరొకప్పుడు మరొక బ్రహ్మదేవుడు ఉండేవాడా?" అని అడగొచ్చు. అలా అడిగే వారికి చిన్న పిట్టకథ ఒకటి చెబుతాను.

ఒక నాడు స్వర్గలోకంలో ఇంద్రుడు చాలా ఊషారుగా ఉన్నాడు. అప్పుడే రాక్షసులమీద దండయాత్ర చేసి, వాళ్ళని హతమార్చి వస్తున్నాడేమో వ్యక్తి అఘమేఘాల్లోనే ఉన్నాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఒక పెద్ద భవనం నిర్మించడానికి నిశ్చయించుకున్నాడు. (ధర్మరాజులవారు రాజసూయ యాగం చేసే ముందు మయసభ నిర్మించలేదూ! అలాగన్న మాట.) వెంటనే విశ్వకర్మకి కబురు పెట్టేడు. విశ్వకర్మ ఇంద్రుడి ఆజ్ఞని శిరసావహించి రాజభవనానికి

కావలసిన హంగులన్నీ కూర్చి ఒక దివ్యమైన భవనానికి రూపురేఖలు దిద్దుతున్నాడు. కట్టబోయే భవనం నమూనాలు చూసినప్పుడల్లా ఇంద్రుడి మనస్సులో కొత్తకొత్తవి, పెద్దపెద్దవి అయిన ఊహలు మొలకెత్తడం మొదలు పెట్టేయి. తనంతటి వాడు తను. రాక్షసుల చేత మట్టి కరిపించిన తను! తన అంతస్తుకి తెస్సోడుతూన్న ఒక సామాన్యపు భవనమా? అందుకని భవనం చుట్టూ ఉద్యానవనం కావాలన్నాడు. విశ్వకర్మ "సరే" అన్నాడు. వనంలో పాలరాతి మండపం అన్నాడు. తర్వాత పాలరాతి గోడలలో నవరత్నాలు తాపడం పెట్టాలన్నాడు. జలయంత్రాలు, అంబుస్పోటాలు...ఇలా అధికార మదాంధతతో ఉన్న ఇంద్రుడు రోజుకో కొత్త కోరిక వెలిబుచ్చడం మొదలు పెట్టేసరికి విశ్వకర్మకి విసుగు పుట్టుకొచ్చింది.

విశ్వకర్మ రహస్యంగా ఊర్ధ్వలోకమైన సత్యలోకానికి ప్రయాణమై వెళ్ళాడు. బ్రహ్మకి అసలు విషయం అవగాహన అయింది. పరిస్థితికి తగిన చర్య జరుగుతుందని నచ్చచెప్పి విశ్వకర్మని దిగువకి పంపి తనేమో ఊర్ధ్వలోకమైన వైకుంఠానికి వెళ్ళాడు. అక్కడ విష్ణుమూర్తి అంతా సావధానంగా విన్నాడు.

మరునాడు స్వర్గంలో ఇంద్రుడు సింహాసనారూఢుడై, అప్సరసల సాన్ని ధ్యంలో ఆనందడోలికలలో ఊగిసలాడుతూ ఉన్న సమయంలో పట్టుమని పదేళ్ళు నిండని ఒక బాలుడు ఒక చేతిలో దండం, మరొక చేత కమండలం, చంకలో కృష్ణాజినం, ముఖంలో దివ్యమైన తేజంతో ఆస్థానంలో ప్రవేశించేడు. సకల విద్యా కోవిదుడని తెలుస్తూనే ఉంది. ఇంద్రుడు ఆ బాలుడిని చూసి సింహాసనం దిగి ఎదురేగి స్వాగతం పలికేడు. అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి యథోచితంగా అతిథిని సత్కరించి, "స్వామీ, తమరెవరో, తమ రాకకి కారణం ఏమిటో శలవియ్యండి" అని వినయ విధేయతలతో అడిగేడు. "ఓ మహాబలీ! ప్రపంచంలో ఎక్కడా కనీ వినీ ఎరగని అత్యద్భుతమైన రాజ ప్రాసాదాన్ని నిర్మిస్తున్నావని నాలుగు నోట్లా విని

విషయావలోకన చేసి పోదామని వచ్చేను. గతంలో ఏ ఇంద్రుడూ ఇటువంటి సౌధాన్ని నిర్మించలేదటగదా?"

గర్వమదాంధతతో ఉన్న ఇంద్రుడు ఈ ముక్కుపచ్చలారని బాలుడి ధిషణని పరాభవించడానికా అన్నట్లు, తూష్ణీంభావంతో, "వత్సా! ఎంతమంది ఇంద్రులని చూసేవేమిటి - అహఁ, ఎంతమంది ఇంద్రుల గురించి విన్నావేమిటి?" అని అడిగేడు.

ఆ ప్రశ్నకి సమాధానంగా మందస్మిత వదనారవిందంతో ఆ బాలుడు ఇలా సమాధానం చెప్పేడు -

"దేవేంద్రా! కుమారా! సావధానంగా విను. నేను చాల మంది ఇంద్రులని చూసేను. నీ తండ్రి కశ్యపుడు నాకు తెలుసు. బ్రహ్మకి కుమారుడు, నీకు తాత అయిన మరీచిని నాకు తెలుసు. ఆ బ్రహ్మ విష్ణుమూర్తి నాభిలోని కమలం నుండి ఉద్భవించడం నేను స్వయంగా ఎరుగుదును. ఆమాట కొస్తే సాక్షాత్తూ ఆ విష్ణుమూర్తినే ఎరుగుదును.

"సృష్ట్యాది ప్రళయ పర్యంతం జరిగే కార్యక్రమాన్ని అంతా కళ్ళారా చూసిన వ్యక్తిని నేను. ఒక సారి కాదు. పదే పదే చూసిన వాడిని. ప్రళయ సమయంలో విశ్వస్వరూపం ఎలా ఉంటుందో తెలుసా? "ఈ విశ్వం" లోని స్థావర జంగమాత్మకమైన ప్రతి అణువు నామరూపాలు లేకుండా నశించిపోయి ప్రళయ నిశీథిలోని అనంతంలో లీనమై అదృశ్యమైపోతుంది. ఆ దృశ్యం వర్ణనాతీతం.

"ఈ విశ్వం" అన్నాను కదూ? ఇలాంటి విశ్వాలు ఎన్నో! ఎన్నని ఎవరు లెక్కపెట్టగలరు? అవి అనంతం. నీటిలోని బడగలలా అనంతమైన విశ్వాలు అలా ఉద్భవిస్తూనే ఉంటాయి. నశిస్తూనే ఉంటాయి. ఒకొక్క విశ్వంలో సృష్టికార్యాలు నిర్వహించడానికి ఒకొక్క బ్రహ్మ. ఇటువంటి సృష్టిలోని విశ్వాలలోని

ప్రపంచాలలో ఇక ఇంద్రులు ఎంతమంది ఉంటారో - వారిని లెక్కపెట్టే ఓపిక ఎవరికి ఉంది? సముద్రపుటొడ్డున ఉండే ఇసక రేణువులని లెక్కపెట్టినట్లు!

"ఒకొొక్క ఇంద్రుడు ఒకొొక్క మన్వంతరం పాటు రాజ్యం ఏలుతాడు. ఇలాంటి ఇంద్రులు 28 మంది అయేసరికి బ్రహ్మదేవుడికి ఒక రోజు...."

ఇలా చెప్పుకు పోతూన్న ఆ బాలుడు హఠాత్తుగా కథనాన్ని ఆపి, నేల మీద బారులు తీర్చి పోతూన్న చీమలని చూసి ఒక చిరునవ్వు నవ్వేడు.

"మహానుభావా, ఎందుకు కథనం ఆపివేసేరు? ఎందుకు అలా నవ్వుతున్నారు?" అని ఇంద్రుడు ఆత్రుతగా అడిగేడు.

"ఎందుకు నవ్వుతున్నానా? అది పరమ రహస్యం.  దుఃఖానికి మూలకారణమేమిటో ఈ రహస్యంలో ఇమిడి ఉంది.  చీకటిలో తాడుని చూసి పాము అని ఎలా అనుకుంటామో, దీపపు వెలుగులో అది పాము కాదని ఎలా తెలుసుకుంటామో అలాగే జ్ఞానోదయం అయిన వ్యక్తి ఈ సృష్టిలోని నిజానిజాల తారతమ్యాన్ని తెలుసుకోగలుగుతున్నాడు.  చూడు ఈ చీమల బారు ఎంత పెద్దగా ఉందో? బారెడు వెడల్పుతో నదీ ప్రవాహంలా పాకుతూన్న ఈ చీమలన్నీ ఒకానొకప్పుడు నీలాగే ఇంద్ర పదవిని అలంకరించిన వారే.  వారి కర్మానుసారం ఇప్పుడు ఇలా చీమలయి కర్మపరిపక్వం కొరకు వేచి ఉన్నారు. ..."

ఆ బాలుడు ఇలా ఉపదేశం చేస్తూ ఉంటే ఇంద్రసభలోకి మరొక విచిత్రమైన వ్యక్తి వచ్చేడు.  నఖశిఖపర్యంతం జుత్తే.  ఛాతీ మీద మాత్రం కొంత మేర రోమాలేవీ లేకుండా ఖాళీగా ఉంది. ఆ ఖాళీ చుట్టూ వలయాకారంలో దుబ్బుగా జుట్టు పెరిగి ఉంది.

ఇప్పటికే సంభ్రమాశ్చర్యాలతో మనిగి తేలుతూన్న ఇంద్రుడు తేరుకొని, "మహానుభావా! తమరు ఎవ్వరు? ఎక్కడ నుండి వస్తున్నారు? నేను మీకు ఏ విధంగా సేవ చేయగలను?" అని కుశల ప్రశ్నలు వేసేడు.

"ఇంద్రా! నువ్వు దిగ్విజయ యాత్ర ముగించుకొని ఒక అత్యద్భుతమైన భవనం నిర్మిస్తున్నావని విని ఆ భవనాన్ని చూసి పోదామని వచ్చేను.

"నేనెవరినా? నన్ను రోమహర్షుడు అంటారు. నా వక్షస్తలం చూస్తున్నావు కదా. ఒకొక్క ఇంద్రుడు మరణించినప్పుడల్లా ఒకొక్క వెంట్రుక ఈ వక్షస్తలం నుండి రాలిపోతుంది. అందుకనే మధ్యలో అలా వెంట్రుకలు లేకుండా బోసిగా ఉంది.

"ఈ ద్వితీయ పరార్ధం పూర్తయ్యేసరికి ఇప్పటి బ్రహ్మ జీవితకాలం చాలిస్తాడు. అప్పుడు వచ్చే మహాప్రళయంలో నేను కూడ లీనమైపోతాను. ఇటువంటి అల్పాయుర్దాయంతో పెళ్ళి చేసుకుని, జంఝాటన పెంచుకోవడమెందుకని బ్రహ్మచారిగా ఉండిపోడానికే నిశ్చయించుకున్నాను.

"ఆ విష్ణుమూర్తి కనురెప్పలు ఒక్కసారి మూని తెరిచే వ్యవధిలో ఒక బ్రహ్మ జీవితకాలం పూర్తయిపోతుంది." ఇలా చెబుతూ రోమహర్షుడు అదృశ్యమైపోయాడు. చీమల బారు గురించి చెపుతూన్న బాలుడు ఎప్పుడో అదృశ్యమైపోయాడు.

ఇదంతా చూసిన ఇంద్రుడికి ఒక విధంగా గర్వభంగమైంది. తను భవన నిర్మాణ పథకాన్ని విరమించుకున్నట్లు విశ్వకర్మతో సవినయంగా మనవి చేసుకున్నాడు.

అదండీ లెక్కకి అందని భారతీయ కాలమానం.